10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 6/5/2026 4:45 AM Page 1

మన రాజధాని
# రక్షణ
నిజం మా బలం
బాపట్ల | గుంటూరు | పల్నాడు
శుక్రవారం 5 జూన్ 2026 పేజీలు : 4

# జూన్ 12 నుంచి కొత్త పెన్షన్లు

## అర్హులకు మరో అవకాశం

## సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ




రాష్ట్రంలో కొత్త పెన్షన్ల కోసం ఎదురు చూస్తున్న మహిళలు, వృద్ధులు, వికలాం గులకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిం ది. జూన్ 12 నుంచి కొత్త దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ప్రకటించింది. అవసరమై న పత్రాలతో గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.




# చీరాల బీచ్‌లో షాక్స్‌కు గ్రీన్ సిగ్నల్

## గోవా తరహాలో బీచ్ షాక్స్‌కు కేబినెట్ ఆమోదం

పైలట్ ప్రాజెక్టు కింద సూర్యలంక, వైజాగ్...

బీచ్ లో విక్రయాల ఏర్పాట్లు పై ప్రజల్లో ఆసక్తికరమైన చర్చ..

ఆంధ్రప్రదేశ్‌లో మద్యం విక్రయాల విస్తరణపై చంద్రబాబు ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. గోవా తరహాలో బీచ్ షాక్స్ ఏర్పాటు చేసి మద్యం విక్రయాలకు అనుమతులు ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించడంతో రాజకీయ, సామాజిక వర్గాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. తొలి దశలో సూర్యలంక, వైజాగ్ బీచ్‌లలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయనున్నారు.

పర్యాటకాభివృద్ధి పేరుతో బీచ్‌లలో మద్యం విక్రయాలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. సూర్యలంకలో కొత్త విధానం చర్చనీయాంశమైంది.

గోవా తరహా బీచ్ షాక్స్‌తో ఉపాధి అవకాశాలా..? లేక మద్యం సంస్కృతికి ప్రోత్సాహమా..? అనే ప్రశ్నలు సామాజిక వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి.

# మంత్రి రాంప్రసాద్ రెడ్డికి ఘన స్వాగతం

## అనారోగ్యంతో ఉన్న నరసింహమూర్తి రాజును పరామర్శించిన మంత్రి, ఎమ్మెల్యే




పిట్టలవానిపాలెం పర్యటనకు వచ్చిన రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ఘన స్వాగతం పలికారు. అనంతరం అనారోగ్యంతో ఉన్న నరసింహమూర్తి రాజును పరామర్శించి ధైర్యం చెప్పారు.

# రష్యా వీధుల్లో 'సింపుల్' లీడర్లు

## లోకేష్, ఎంపీ లావు కృష్ణదేవరాయలుకు అక్కడ ప్రజల మధ్య ప్రత్యేక ఆకర్షణ

## పెట్టుబడుల వేటలో బిజీగా గడుపుతున్న ఏపీ ప్రతినిధి బృందం




రష్యా పర్యటనలో మంత్రి నారా లోకేష్ , ఎంపీ లావు కృష్ణ దేవరాయలు సాధారణ ప్రజల్లా వీధుల్లో సంచరించడం ఆకట్టుకుంది. పెట్టుబడుల వేటతో పాటు వారి సింప్లిసిటీ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# కలెక్టర్ సార్ ఎక్కడ...?

పడకేసిన పంచాయితీ పాలన....

అధికారుల నిర్లక్ష్యంతో ప్రజల నరకయాతన..

ఫిర్యాదులు వందైనా చర్యలు శూన్యం

అవినీతి అధికారులకు ప్రమోషనా....




బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గంలోని చెరుకూరి పంచాయతీ అవినీతి, నిర్లక్ష్యం, పారిశుద్ధ్య సమస్యలతో అధోగతి పట్టిందన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. వందల ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించకపోవడం, విచారణలో ఉన్న అధికారులకు ప్రమోషన్లు ఇవ్వడం, ప్రజా సమస్యలపై కలెక్టర్ స్పందించకపోవడంపై గ్రామ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే పంచాయతీ కార్యాలయానికి తాళాలు వేసి నిరసనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

# పునాది విద్య బలోపేతానికి ఉపాధ్యాయుల శిక్షణ

అంగలకుదురులో జ్ఞానప్రకాశ్ కార్యక్రమం ప్రారంభం

చదవడం--రాయడం నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి



10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 6/5/2026 4:45 AM Page 2



# చీరాల బీచ్‌లో షాక్స్‌కు గ్రీన్ సిగ్నల్

మొదటి పేజీ తరువాయి

బాపట్ల రక్షణ బ్యూరో:...

రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న తాజా నిర్ణయాలు ఇప్పుడు మద్యం విధానంపై కొత్త చర్చకు దారితీస్తున్నాయి. ఇప్పటికే మద్యం ధరలు, విక్రయ విధానాలపై విమర్శలు ఎదుర్కొంటున్న ప్రభుత్వం తాజాగా బీచ్ షాక్స్ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలపడంతో మరోసారి వార్తల్లో నిలిచింది. గోవా తరహాలో సముద్రతీర ప్రాంతాల్లో ప్రత్యేక షాక్స్ ఏర్పాటు చేసి అక్కడే మద్యం సేవించేలా అనుమతులు ఇవ్వాలని నిర్ణయించడం రాజకీయంగా, సామాజికంగా చర్చనీయాంశమైంది. మొదటి దశలో బాపట్ల జిల్లా సూర్యలంక బీచ్‌తో పాటు విశాఖపట్నంలోని ప్రధాన బీచ్ ప్రాంతంలో ఈ ప్రాజెక్టును అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు బీచ్ షాక్స్ నిర్వహణకు అనుమతులు ఇవ్వనున్నట్లు సమాచారం. పర్యాటకులను ఆకర్షించడం, తీరప్రాంతాల్లో కొత్త వాణిజ్య అవకాశాలు కల్పించడం లక్ష్యమని అధికారులు చెబుతున్నప్పటికీ, మద్యం వినియోగం మరింత పెరిగే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.గోవాలో అమలవుతున్న బీచ్ సంస్కృతి, రాత్రి జీవన విధానం వేరు అయినప్పటికీ అదే తరహా విధానాన్ని ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేయడంపై సామాజిక వర్గాలు సందేహాలు వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా కుటుంబాలతో వచ్చే పర్యాటకులకు ఇది అసౌకర్యంగా మారే అవకాశముందని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే బీచ్ ప్రాంతాల్లో భద్రత, ట్రాఫిక్, రాత్రి వేళల్లో నియంత్రణ వంటి అంశాలు సవాళ్లుగా ఉన్న సమయంలో మద్యం విక్రయాలకు అనుమతులు ఇవ్వడం వివాదాస్పదంగా మారింది.ప్రభుత్వం మాత్రం దీనిని పర్యాటకాభివృద్ధికి కీలక అడుగుగా చెబుతోంది. బీచ్ షాక్స్ ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, తీరప్రాంత ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రాలుగా సూర్యలంక, వైజాగ్ బీచ్‌లను తీర్చిదిద్దే ప్రయత్నంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు వివరిస్తున్నాయి.అయితే ప్రతిపక్షాలు ఈ నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబడుతున్నాయి. ఇప్పటికే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మద్యం ఆదాయంపై ఆధారపడుతోందని విమర్శిస్తున్న ప్రతిపక్షాలు, ఇప్పుడు బీచ్‌లను కూడా మద్యం విక్రయ కేంద్రాలుగా మార్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపిస్తున్నాయి. పర్యాటకాభివృద్ధి పేరుతో ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టుతున్నారని మండిపడుతున్నాయి.సామాజిక కార్యకర్తలు కూడా ఈ నిర్ణయంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీచ్ ప్రాంతాలు కుటుంబాలు, యువత ప్రశాంతంగా గడిపే ప్రదేశాలుగా ఉండాలని, అక్కడ మద్యం సంస్కృతిని ప్రోత్సహించడం మంచిది కాదని చెబుతున్నారు. ముఖ్యంగా యువతపై దీని ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశముందని హెచ్చరిస్తున్నారు.మరోవైపు పర్యాటక రంగానికి చెందిన వ్యాపారులు మాత్రం ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారు. గోవా, పుదుచ్చేరి తరహాలో బీచ్ సంస్కృతి అభివృద్ధి చెందితే దేశీయ, విదేశీ పర్యాటకులు ఆకర్షితులవుతారని భావిస్తున్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు, స్థానిక వ్యాపారాలకు ఆదాయం పెరిగే అవకాశముందని చెబుతున్నారు.పైలట్ ప్రాజెక్టు విజయవంతమైతే భవిష్యత్తులో రాష్ట్రంలోని ఇతర బీచ్‌లలో కూడా ఈ విధానాన్ని అమలు చేసే అవకాశం ఉందని సమాచారం. దీంతో తీరప్రాంత జిల్లాల్లో ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం రాజకీయంగా, సామాజికంగా మరింత చర్చకు దారితీసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# జూన్ 12 నుంచి కొత్త పెన్షన్లు

మొదటి పేజీ తరువాయి

ఉమ్మడి గుంటూరు -- రక్షణ బ్యూరో:

రాష్ట్ర ప్రభుత్వం సామాజిక భద్రతా పథకాల అమలులో భాగంగా కొత్త పెన్షన్ల మంజూరుకు చర్యలు వేగవంతం చేసింది. జూన్ 12 నుంచి అర్హులైన వారి నుంచి కొత్త దరఖాస్తులు స్వీకరించనున్నట్లు విడుదలైన పాంప్లెట్ ద్వారా స్పష్టం చేసింది. మహిళలు, వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు. ఇప్పటికే గ్రామాలు, పట్టణాల్లో ఈ ప్రకటన చర్చనీయాంశంగా మారింది.పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే వారు కొన్ని కీలక పత్రాలు తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది. ఆధార్ కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ ఖాతా వివరాలు తప్పనిసరిగా ఇవ్వాలని అధికారులు స్పష్టం చేశారు. పత్రాలు పూర్తి స్థాయిలో లేకపోతే దరఖాస్తులు తిరస్కరించే అవకాశముందని హెచ్చరిస్తున్నారు.వితంతు మహిళల కోసం ప్రత్యేకంగా వితంతు పెన్షన్ అందించనున్నారు. దీనికి భర్త మరణ ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. అదే విధంగా ఒంటరి మహిళల పెన్షన్ కోసం గ్రామ రెవెన్యూ అధికారులు లేదా సంబంధిత అధికారుల ధ్రువీకరణ అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వం మహిళల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.వృద్ధాప్య పెన్షన్ కోసం 60 సంవత్సరాలు పూర్తి చేసిన వారు అర్హులుగా పరిగణించబడతారు. ఆధార్ ఆధారంగా వయస్సును నిర్ధారించనున్నారు. ఇక వికలాంగుల పెన్షన్ కోసం సదరం ధృవీకరణ పత్రం తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది. అర్హత ప్రమాణాలు పూర్తి చేసిన వారికే పెన్షన్లు మంజూరు చేస్తామని అధికారులు చెబుతున్నారు.గ్రామ, వార్డు సచివాలయాల వద్ద ఇప్పటికే ప్రజలు వివరాలు తెలుసుకునేందుకు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు అవసరమైన పత్రాలు సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. గతంలో దరఖాస్తు చేసుకున్నా పెన్షన్ రాకపోయిన వారు ఈసారి ఆశగా ఎదురుచూస్తున్నారు.ప్రభుత్వం ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తామని చెబుతోంది. ఎలాంటి మధ్యవర్తులను నమ్మవద్దని, నేరుగా సచివాలయాల్లోనే దరఖాస్తులు సమర్పించాలని ప్రజలకు సూచిస్తున్నారు. పూర్తి సమాచారం, సరైన పత్రాలతో దరఖాస్తు చేస్తే పరిశీలన త్వరగా పూర్తవుతుందని అధికారులు పేర్కొంటున్నారు.కొత్త పెన్షన్ల ప్రకటనతో నిరుపేద కుటుంబాల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, వికలాంగులు ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన నిబంధనల ప్రకారం పత్రాలు సిద్ధం చేసుకుని సమయానికి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు మరోసారి విజ్ఞప్తి చేస్తున్నారు.

# మంత్రి రాంప్రసాద్ రెడ్డికి ఘన స్వాగతం

మొదటి పేజీ తరువాయి

బాపట్ల రక్షణ న్యూస్....

పిట్టలవానిపాలెం మండల పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి గారికి శాలువా కప్పి, జ్ఞాపికగా మొక్కను అందజేసి ఆత్మీయంగా ఆహ్వానించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు కూడా మంత్రి రాక సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు.అనంతరం ఇటీవల అనారోగ్యానికి గురైన పిట్టలవానిపాలెం గ్రామానికి చెందిన కంకిపాటి నరసింహమూర్తి రాజును మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు కలిసి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయా అనే విషయాన్ని కుటుంబ సభ్యులను ప్రశ్నించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకోవడం, అవసరమైన సమయంలో అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. స్థానిక ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి పర్యటన సందర్భంగా పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పునాది విద్య బలోపేతానికి ఉపాధ్యాయుల శిక్షణ

మొదటి పేజీ తరువాయి

తెనాలి:రక్షణ న్యూస్...

పునాది స్థాయి విద్యను మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా గ్రేడ్-1, 2 ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న "జ్ఞానప్రకాశ్" శిక్షణ కార్యక్రమం గురువారం అంగలకుదురు పీఎం శ్రీ ఉన్నత పాఠశాలలో ప్రారంభమైంది. సమగ్ర శిక్ష, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి, ప్రముఖ విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.తొలి రోజు శిక్షణలో భాగంగా ఉపాధ్యాయుల నమోదు కార్యక్రమం చేపట్టారు. అనంతరం శిక్షణ లక్ష్యాలు, విద్యార్థుల అభ్యాస ఫలితాల మెరుగుదల, పునాది స్థాయి విద్య ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుల పరిచయ కార్యక్రమంతో పాటు ప్రాథమిక పరీక్ష నిర్వహించారు.విద్యార్థుల్లో చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలను పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని శిక్షణలో వివరించారు. విద్యార్థి కేంద్రిత బోధన పద్ధతులను అమలు చేయడం ద్వారా అభ్యాస సామర్థ్యాలు మెరుగుపడతాయని నిపుణులు సూచించారు.మధ్యాహ్న సమయంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.కే. సలీం బాషా శిక్షణ కేంద్రాన్ని సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. ప్రతి విద్యార్థి ప్రాథమిక స్థాయిలో చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల అభ్యాస పురోగతిని నిరంతరం పరిశీలిస్తూ బోధనలో మార్పులు తీసుకురావాలని తెలిపారు.అనంతరం బాలల హక్కులు, లింగ సమానత్వం, బాలల రక్షణ, ఆరోగ్యం, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత అంశాలపై నిపుణులు శిక్షణ ఇచ్చారు. పిల్లలకు సురక్షితమైన, ప్రోత్సాహకరమైన విద్యా వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని వివరించారు. రోజు ముగింపులో ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా పునాది స్థాయి విద్య, బాలల అభివృద్ధి, రక్షణ అంశాలపై మరింత అవగాహన పెరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.కే. సలీం బాషా, మండల విద్యాశాఖ అధికారులు డాక్టర్ ఎం. లక్ష్మీనారాయణ, వి. జయం తిబాబు, ప్రధానోపాధ్యాయురాలు అనురాధ పాల్గొన్నారు.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 6/5/2026 4:45 AM Page 3



# కలెక్టర్ సార్ ఎక్కడ....?

మొదటి పేజీ తరువాయి

**పర్చూరు రక్షణ న్యూస్...**

పర్చూరు నియోజకవర్గంలోని చెరుకూరి పంచాయతీ పరిస్థితి రోజురోజుకీ దారుణంగా మారుతోందన్న విమర్శలు గ్రామ ప్రజల నుంచే బహిరంగంగా వినిపిస్తున్నాయి. కోట్ల రూపాయల నిధులు వచ్చినా అభివృద్ధి కనిపించకపోవడం, పారిశుద్ధ్యం పూర్తిగా కుప్పకూలిపోవడం, మంచినీటి సమస్యలు తీవ్రరూపం దాల్చడం, చెరువులు మురుగు కాలువలుగా మారిపోవడం వంటి పరిస్థితులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.గత ఇరవై రోజులుగా గ్రామంలో పారిశుద్ధ్య పనులు దాదాపు నిలిచిపోయాయని స్థానికులు చెబుతున్నారు. చెత్త తొలగింపు లేకపోవడంతో వీధులన్నీ మురికితో నిండిపోయాయి. దుర్వాసనతో ప్రజలు ఇళ్ల బయటకు రావడానికి కూడా భయపడుతున్న పరిస్థితి నెలకొంది. గ్రామంలో దోమలు విపరీతంగా పెరిగి జ్వరాల భయం వెంటాడుతోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పంచాయతీ కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడంతో వారు పనులకు రావడం మానేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అయితే మరోవైపు తెల్ల కాగితాలపై సంతకాలు తీసుకుని జీతాలు చెల్లించినట్లు రికార్డులు సృష్టించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎనిమిది మంది కార్మికుల పేర్లతో సంతకాలు తీసుకుని డబ్బులు మళ్లించారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పంచాయతీ కార్యదర్శిపై ఇప్పటికే విచారణ కొనసాగుతుండగానే ప్రమోషన్‌పై బదిలీ చేయడం గ్రామ ప్రజలను మరింత ఆగ్రహానికి గురిచేసింది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి పదోన్నతి ఇవ్వడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.గ్రామ ప్రజలు పలుమార్లు జిల్లా కలెక్టర్‌కు, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. "వస్తాం... చూస్తాం..." అనే మాటలు తప్పితే ఇప్పటివరకు ఒక్క సమస్యపై కూడా స్పష్టమైన చర్యలు తీసుకోలేదని మండిపడుతున్నారు. ఫిర్యాదులు చేసిన వారి ఫోన్ నెంబర్లను బ్లాక్ జాబితాలో పెట్టారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.ప్రత్యేక అధికారిగా ఉన్న అధికారి కూడా "నాకు చెక్ పవర్ లేదు... నేను ఏం చేయలేను..." అంటూ చేతులెత్తేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు రావాల్సిన అధికారులు బాధ్యతల నుంచి తప్పించుకుంటున్నారని మండిపడుతున్నారు.ఎనిమిది వేల జనాభా ఉన్న ఈ ప్రధాన పంచాయతీలో ప్రజలు కనీస సౌకర్యాలకు నోచుకోకపోవడం దారుణమని స్థానికులు అంటున్నారు. గ్రామంలో మంచినీటి సమస్య తీవ్రమైందని, జల మిషన్ పనులకు రెండు సంవత్సరాల క్రితమే నిధులు మంజూరైనప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం మరమ్మత్తులు జరుగుతున్నాయని చెబుతుండగా, గ్రామంలో అలాంటి పనుల జాడ కూడా కనిపించడం లేదని ప్రజలు చెబుతున్నారు.చెరువులు మురుగు కాలువలుగా మారిపోవడంతో గ్రామ వాతావరణం పూర్తిగా కలుషితమైందని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు అనారోగ్యానికి గురవుతున్నా వైద్యశిబిరాలు కూడా నిర్వహించలేదని అంటున్నారు.గ్రామంలో నెలకొన్న పరిస్థితులపై పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ స్పందించి ఇటీవల ప్రత్యేక ఆడిట్ బృందాన్ని పంపించినట్లు సమాచారం. ఆడిట్ పూర్తయి దాదాపు ఇరవై రోజులు గడిచినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అవినీతి బయటపడినా అధికారులు ఎందుకు మౌనం పాటిస్తున్నారన్న ప్రశ్నలు ప్రజల్లో వినిపిస్తున్నాయి. గ్రామంలోని స్థానిక రాజకీయ నాయకులపై కూడా ప్రజలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. కొంతమంది నాయకులు వ్యక్తిగత ప్రయోజనాల కోసం పంచాయతీని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యే కూడా ఈ సమస్యలపై స్పందించడం లేదని, గ్రామ ప్రజల బాధలు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు."కోట్ల రూపాయలు వచ్చాయి... కానీ గ్రామంలో ఒక్క పని కనిపించడం లేదు. ఎవరికివారు దోచుకున్నారే తప్ప అభివృద్ధి ఎక్కడా లేదు" అంటూ గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి గ్రామ పరిస్థితిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే పంచాయతీ కార్యాలయానికి తాళాలు వేసి పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు.చెరుకూరి పంచాయతీలో నెలకొన్న పరిస్థితులు ఇప్పుడు పర్చూరు నియోజకవర్గంలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులు, నాయకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు మరింత బలపడుతున్నాయి.

# రష్యా వీధుల్లో 'సింపుల్' లీడర్లు

మొదటి పేజీ తరువాయి

**గుంటూరు /రష్యా: రక్షణ న్యూస్**

రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావాలనే లక్ష్యంతో రష్యా పర్యటనలో ఉన్న రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ , తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ లావు కృష్ణ దేవరాయలు అక్కడి వీధుల్లో సాధారణ ప్రజల్లా తిరుగుతూ కనిపించడం ఆసక్తికరంగా మారింది. భారత్‌లో ఉంటే భారీ భద్రత, సైరన్లు, ప్రోటోకాల్ మధ్య తిరిగే నేతలు.. విదేశీ నేలపై మాత్రం ఎలాంటి హడావిడి లేకుండా స్థానికులతో కలిసిపోయి సాధారణ పర్యాటకుల్లా సంచరించడం సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది.రష్యాలో పెట్టుబడుల ఆకర్షణ, పారిశ్రామిక భాగస్వామ్యాలపై పలువురు ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తున్న ఈ ఇద్దరు నేతలు, అధికారిక కార్యక్రమాల మధ్యలో అక్కడి వీధుల్లో సాధారణ ప్రజలతో కలిసి నడుస్తూ కనిపించారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.ప్రత్యేక భద్రతా వలయాలు, రాజకీయ హడావిడి లేకుండా అక్కడి సంస్కృతి, జీవనశైలిని ఆస్వాదిస్తూ స్థానికులతో మమేకమవుతున్న తీరు పలువురిని ఆకట్టుకుంటోంది. "పదవులు ఉన్నా సరే సాధారణతను మరిచిపోలేదు" అంటూ టీడీపీ కార్యకర్తలు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.ఇదిలా ఉండగా, రాష్ట్రానికి ఐటీ, డేటా సెంటర్లు, ఎలక్ట్రానిక్స్, పారిశ్రామిక రంగాల్లో పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా మంత్రి లోకేష్ విదేశీ పర్యటనలు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే పలు అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించినట్లు సమాచారం. ఎంపీ లావు కృష్ణదేవరాయలు కూడా పెట్టుబడుల చర్చల్లో చురుకుగా పాల్గొంటున్నారు.రాజకీయ హడావిడికి దూరంగా విదేశీ వీధుల్లో సాధారణ వ్యక్తుల్లా కనిపించిన ఈ దృశ్యాలు ఇప్పుడు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి.

# ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలి

## ప్రభుత్వ సేవల కోసం 'మనమిత్ర' యాప్‌ను వినియోగించాలి

**జీఎంసి , రక్షణ న్యూస్:**



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి నిరంతరాయంగా అందాలంటే ఈ-కేవైసీ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ సూచించారు.గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఇంకా ఈ-కేవైసీ పూర్తి చేయని లబ్ధిదారులు వెంటనే తమ ఆధార్ వివరాలను నవీకరించుకుని ప్రక్రియను పూర్తిచేయాలని కోరారు. ఈ-కేవైసీ పూర్తి చేయడం ద్వారా సంక్షేమ పథకాల ప్రయోజనాలు పారదర్శకంగా, సకాలంలో అందుతాయని తెలిపారు.ప్రజలకు ప్రభుత్వ సేవలు, ధ్రువపత్రాలు, ఇతర అవసరమైన సమాచారాన్ని సులభంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మనమిత్ర' యాప్‌ను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. చిన్న చిన్న పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా డిజిటల్ విధానంలో సేవలు పొందవచ్చన్నారు.నగర ప్రజలకు ఈ-కేవైసీ, మనమిత్ర యాప్‌పై విస్తృత అవగాహన కల్పించాలని వార్డు సచివాలయ కార్యదర్శులను ఆదేశించినట్లు తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సహాయం అందించాలని సూచించారు.ప్రజల సహకారంతోనే ప్రభుత్వ సేవల పంపిణీ మరింత సమర్థవంతంగా జరుగుతుందని పేర్కొన్న కమిషనర్, నగర ప్రజలందరూ ముందుకు వచ్చి డిజిటల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నగరంలో వంద శాతం ఈ-కేవైసీ లక్ష్యాన్ని సాధించేందుకు సచివాలయ సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# కలలకు దారి చూపే కెరీర్ కౌన్సిలింగ్...

## వసతి గృహ విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణ..

## జేఈఈ, నీట్‌కు ప్రత్యేక బ్యాచ్‌లు

**గుంటూరు , రక్షణ న్యూస్:**

ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు కెరీర్ కౌన్సిలింగ్‌ను ప్రాక్టికల్‌గా అందించాలని గుంటూరు జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ సూచించారు. విద్యార్థులను వివిధ కంపెనీలు, సంస్థలు, పరిశ్రమల వద్దకు తీసుకెళ్లి ప్రత్యక్ష అవగాహన కల్పిస్తే వారి భవిష్యత్ లక్ష్యాలపై స్పష్టత పెరుగుతుందని పేర్కొన్నారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జేఈఈ, నీట్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం 120 మంది బాలురు, 120 మంది బాలికలతో ప్రత్యేక బ్యాచ్‌లు ఏర్పాటు చేసి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సూపర్-60 తరహా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రతి ఏడాది జిల్లా నుంచి ఐఐటీలు, ఎన్ఐటీలు, వైద్య విద్యాసంస్థల్లో ప్రవేశాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ ఉందని, సరైన సమయంలో సరైన మార్గదర్శకత్వం అందిస్తే ఉన్నత స్థానాలు సాధించగలరని కలెక్టర్ అన్నారు. మైక్రోసాఫ్ట్, నేవీతో పాటు ఇతర ప్రముఖ సంస్థలను సందర్శించే అవకాశాలు కల్పించడం ద్వారా వారి ఆలోచనా పరిధి విస్తరిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి



జిల్లా విద్యాశాఖ అధికారిని సమన్వయ అధికారిగా నియమించి సమర్థంగా అమలు చేయాలని ఆదేశించారు.ప్రభుత్వ భవనాల్లో నడుస్తున్న 32 వసతి గృహాలు అన్ని మౌలిక వసతులతో ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పిస్తే చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని చెప్పారు. వసతి గృహాల నవీకరణ పనులను ఆరు నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు. చెన్నయ్య, బీసీ సంక్షేమ శాఖ అధికారి కె. మయూరి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి డి. దుర్గాభాయి, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి పార్థసారథి, జిల్లా విద్యాశాఖ అధికారి డా. షేక్ సలీం భాషా తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల మ్యాపింగ్‌కు వేగం పెంచండి

జూన్ నెలాఖరులోగా ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశం



**నరసరావుపేట రక్షణ న్యూస్:**

ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా చేపడుతున్న ఓటర్ల మ్యాపింగ్ కార్యక్రమాన్ని ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని పల్నాడు జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ సంజనా సింహా అధికారులను ఆదేశించారు. గురువారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆమె ఓటర్ల మ్యాపింగ్ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. 2002 ఓటర్ల జాబితా, 2025 ఓటర్ల జాబితాలో నమోదైన వారిని నేరుగా మ్యాపింగ్ చేయాలని సూచించారు. కేవలం 2025 ఓటర్ల జాబితాలో మాత్రమే నమోదైన వారి విషయంలో కుటుంబ సభ్యుల వివరాలను పరిశీలించి మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లతో పాటు ఎంపీడీవోలు కూడా పర్యవేక్షణ బాధ్యతలు చేపట్టాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఓటరు ముసాయిదా జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని, నకిలీ ఓటర్ల పేర్లను గుర్తించి తొలగించాలని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా ప్రక్రియను పారదర్శకంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రపంచ పర్యావరణ దినోత్సవ పోస్టర్, బ్యానర్ ఆవిష్కరించిన కలెక్టర్




**బాపట్ల, రక్షణ న్యూస్:**

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీక్షణ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో పర్యావరణ దినోత్సవ వాల్ పోస్టర్, బ్యానర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజలు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. ఇంటి వద్ద ఉత్పత్తి అయ్యే చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేసి సంబంధిత మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని తెలిపారు. అలాగే మురుగు నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పరిశుభ్రమైన వాతావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు అందరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ నారాయణ బట్టు, రెడ్‌క్రాస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

## ఎస్ఐఆర్ విజయవంతానికి బూత్ స్థాయి ఏజెంట్లు కృషి చేయాలి

**సత్తెనపల్లి రక్షణ న్యూస్:**

సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలోని ముప్పాళ్ల మండల బూత్ కమిటీ సభ్యులతో నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి సమావేశమయ్యారు. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో బూత్ స్థాయి ఏజెంట్లకు ఎస్ఐఆర్ కార్యక్రమంపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమంలో బీఎల్ఏలు తమ పరిధిలోని ఓటరు జాబితాలో ప్రతి ఓటరు వివరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బూత్ లెవల్ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ఓటరు జాబితా పరిశీలన చేపట్టాలని తెలిపారు. ప్రతి బూత్ స్థాయి ఏజెంట్‌కు 2025 ఓటరు జాబితాతో పాటు వర్క్‌షీట్లు, హ్యాండ్‌బుక్‌లు, సంబంధిత సమాచార కిట్‌లను అందజేశారు. కార్యక్రమం నిర్వహణలో వాటిని సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించిన విధివిధానాలను రాష్ట్ర బూత్ కమిటీ




ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి, పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఇందూరు నరసింహారెడ్డి, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు కాల్వపల్లి బ్రహ్మారెడ్డి సవివరంగా వివరించారు. బూత్ స్థాయి ఏజెంట్లు, నాయకులు అడిగిన సందేహాలకు సమాధానాలు ఇచ్చి నివృత్తి చేశారు. అంతకుముందు డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి శిరిడీ సాయినాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ, వార్డు స్థాయి పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల బాధ్యులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో నాణ్యతకు రాజీ లేదు

## వర్షాకాలానికి ముందే డ్రైన్లు, కల్వర్టుల పనులు పూర్తి చేయాలి

**జీఎంసి రక్షణ న్యూస్:**

గుంటూరు నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాల విషయంలో ఎలాంటి రాజీకి తావులేదని నగర పాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ స్పష్టం చేశారు. గురువారం చుట్టుగుంట, మురికిపేట, వీఐపీ రోడ్డు, కృష్ణబాబు కాలనీ, చంద్రబాబు నాయుడు కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి జరుగుతున్న, పూర్తైన అభివృద్ధి పనులను పరిశీలించారు .చుట్టుగుంట, మురికిపేట ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న డ్రైన్ల పనులను పరిశీలించిన కమిషనర్, గతంలో వర్షాల సమయంలో మురుగునీరు ఇళ్లలోకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మురుగునీటి పారుదలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా డ్రైన్ల నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మురుగునీటి ప్రవాహానికి అనుగుణంగా అవసరమైతే మూడో పక్షం సాంకేతిక అభిప్రాయం తీసుకుని కల్వర్టుల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని సూచించారు. చుట్టుగుంట నుంచి మెడికల్ క్లబ్ వరకు నిర్మిస్తున్న డ్రైన్ల మార్గంలో ఉన్న ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. అనంతరం వీఐపీ రోడ్డు, కృష్ణబాబు కాలనీ, చంద్రబాబు నాయుడు కాలనీలలో నిర్మించిన సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లను పరిశీలించారు. అభివృద్ధి పనుల్లో



నూరు శాతం నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. వివిధ శాఖల మధ్య సమన్వయం పెరిగితే పనులు వేగంగా పూర్తవుతాయని పేర్కొన్నారు. ప్రారంభించిన పనులను మధ్యలో నిలిపివేయకుండా కాంట్రాక్టర్లతో పూర్తి చేయించాలని, ముఖ్యంగా వర్షాకాలంలో సమస్యలు తలెత్తకుండా డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రధాన డ్రైన్లలో పూడికతీత పనులను కూడా పరిశీలించిన కమిషనర్, వర్షాలు ప్రారంభం కాకముందే సిల్ట్ తొలగింపు పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పర్యటనలో ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఈఈలు విష్ణు, కళ్యాణరావు, డీఈఈ ఈదర శ్రీనివాసరావు, ఏఈలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రజలతో మమేకమైన ఎమ్మెల్యే బూర్ల

'మన ఎమ్మెల్యే - మన వద్దకు' కార్యక్రమానికి విశేష స్పందన

**ప్రత్తిపాడు, రక్షణ న్యూస్:**

'మన ఎమ్మెల్యే - మన వద్దకు' కార్యక్రమంలో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ 26వ డివిజన్ చౌడవరం ప్రాంతంలో ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు ప్రజలతో మమేకమయ్యారు. స్థానిక నాయకులతో కలిసి అల్పాహారం చేస్తూ ప్రజల సమస్యలు, అభిప్రాయాలను నేరుగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలపై ఎమ్మెల్యే ఆరా తీశారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమవడం ద్వారా వారి అవసరాలు, అభిప్రాయాలను తెలుసుకోవడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని




తెలిపారు. స్థానిక నాయకులతో కలిసి అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చించిన ఎమ్మెల్యే, ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధిగా పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ పిలుపు

**బాపట్ల, రక్షణ న్యూస్:**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు బాపట్ల నియోజకవర్గ పరిధిలోని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పర్యావరణ హిత కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అనే సందేశాన్ని సమాజానికి చేరవేయాలనే ఉద్దేశంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు సాధ్యమైనంత వరకు తమ రోజువారీ కార్యక్రమాలకు సైకిళ్లను వినియోగించాలని సూచించారు. సైకిల్ వినియోగం ద్వారా కాలుష్యం తగ్గడంతో పాటు ఇంధన వినియోగం తగ్గి ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశాఖపట్నంలో విమానాశ్రయం



నుంచి విడిది కేంద్రం వరకు సైకిల్ యాత్ర చేపట్టి పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొన్నారు. వాతా వరణ మార్పులు, పెరుగు తున్న కాలుష్యం, తగ్గుతున్న పచ్చదనం వంటి సవాళ్లను ఎదుర్కోవడంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని అన్నారు. ఇంధన వినియోగాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణానికి మేలు చేయవచ్చని, చిన్న చిన్న ప్రయ త్నాలే పెద్ద మార్పులకు నాంది పలుకుతాయని తెలిపారు. ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలతో ఈసారి మహానాడును హైబ్రిడ్ విధానంలో నిర్వహించగా లక్షలాది మంది కార్యకర్తలు డిజిటల్ వేదికగా పాల్గొన్నారని వివరించారు. బాపట్ల నియోజకవర్గ ప్రజలందరూ పర్యావరణ పరిరక్షణకు తమవంతు బాధ్యతగా ముందుకు వచ్చి పచ్చదనాన్ని పెంపొందించే కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

# రూ.2.62 కోట్ల అభివృద్ధి పనులు పూర్తి

## సీఆర్ నగర్ బీటీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

**గుంటూరు రక్షణ న్యూస్:**

'మన ఎమ్మెల్యే -- మన వద్దకు' కార్యక్రమంలో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ 26వ డివిజన్ దాసరిపాలెంలో పూర్తి చేసిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు ప్రారంభించారు. రూ.67.60 లక్షల వ్యయంతో నిర్మించిన సీఆర్ నగర్ (కల్లం ఇంజినీరింగ్ కాలేజీ రోడ్డు) బీటీ రోడ్డును ఆయన ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా కొత్తూరు ఆంజనేయస్వామి ఆలయం నుంచి దాసరిపాలెం సీఆర్ నగర్ వరకు కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీగా చేరుకుని రోడ్డును ప్రారంభించారు. స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని అన్నారు. గత ఐదేళ్లలో అభివృద్ధి పనులు నిర్లక్ష్యానికి గురయ్యాయని, ప్రజా సమస్యల పరిష్కారంపై సరైన దృష్టి సారించలేదని విమర్శించారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర



అభివృద్ధి అనే ద్వంద్వ లక్ష్యాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. గత ప్రభుత్వ వైఫల్యాలను అధిగమించి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 26వ డివిజన్ పరిధిలో ఇప్పటికే రూ. 2.62 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని మౌలిక సదుపాయాల పనులను చేపట్టి ప్రజల అవసరాలను తీర్చనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అబద్ధపు హామీలపై వైసీపీ నిరసన

## కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని విమర్శ

**ముండ్లమూరు, రక్షణ న్యూస్:**

ముండ్లమూరు మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో "చంద్రబాబు వెన్నుపోటు – అబద్ధపు హామీలకు రెండేళ్లు" పేరుతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండేళ్ల టీడీపీ కూటమి పాలనలో ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని విమర్శించారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, సంక్షేమ పథకాల అమలులో



నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధి చూపడం లేదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# రాజధాని భూసేకరణకు వేగం పెంచాలి

## పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం



**కలెక్టరేట్ , రక్షణ న్యూస్:**

రాజధాని నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని గుంటూరు జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ కొల్లాబత్తుల కార్తీక్‌తో కలిసి రాజధాని భూసేకరణ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ-3, ఈ-13, ఈ-15 పరిధిలోని సీడ్ యాక్సిస్ రోడ్డు, స్టీల్ బ్రిడ్జి, జాతీయ రహదారి-16ను అనుసంధానించే ట్రంక్ రోడ్డు నిర్మాణాలకు అవసరమైన భూసేకరణలో పెండింగ్‌లో ఉన్న అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ఇరిగేషన్, రైల్వే తదితర శాఖలకు సంబంధించిన భూముల విషయంలో పూర్తి వివరాలతో కూడిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఆర్డీవోలు, తహసీల్దార్లు ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని క్షేత్రస్థాయిలో సంయుక్త తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టి పెండింగ్ అంశాలను పూర్తిచేయాలని సూచించారు. ఆర్‌అండ్‌ఆర్ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని, లంక భూములకు సంబంధించి ఏకీకృత నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామకంఠాలు, మ్యుటేషన్ల అంశాలపై ఆర్డీవోలు ప్రత్యేక దృష్టి సారించి పనులు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో ఖాజావలి, ఆర్డీవో శ్రీనివాసరావు, సీఆర్‌డీఏ అధికారులు, డిప్యూటీ కలెక్టర్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కారుణ్య నియామకాల సర్టిఫికెట్ వెరిఫికేషన్ రేపు

## కుటుంబీకులకు జిల్లా పరిషత్ కార్యాలయం సమాచారం

**గుంటూరు, రక్షణ న్యూస్**

ఉమ్మడి గుంటూరు జిల్లాలో జిల్లా పరిషత్ కార్యాలయంలో కారుణ్య నియామకాల కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయ కుటుంబీకులు శనివారం నిర్వహించే సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాలని అధికారులు సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు పోస్టు ద్వారా సమాచారం పంపినట్లు తెలుస్తోంది. సంబంధిత అభ్యర్థులు అవసరమైన ధ్రువపత్రాలతో జిల్లా పరిషత్ కార్యాలయానికి హాజరుకావాలని సూచించారు. అయితే కొందరికి పోస్టు ద్వారా సమాచారం అందకపోయే అవకాశం ఉన్నందున, అప్లికేషన్ సమర్పించిన వారు నేరుగా జిల్లా పరిషత్ కార్యాలయాన్ని సంప్రదించాలని అధికారులు తెలిపారు. కారుణ్య నియామకాల ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేసే దిశగా చర్యలు చేపడుతున్నట్లు సమాచారం.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 6/5/2026 4:45 AM Page 6



# గుంటూరు సర్వే ఏడీగా సజ్జ వెంకటేశ్వరావు

### జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన అధికారి



**గుంటూరు, రక్షణ న్యూస్:**

గుంటూరు జిల్లా సర్వే శాఖ సహాయ సంచాలకుడిగా (ఏడీ) సజ్జ వెంకటేశ్వరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. పల్నాడు జిల్లాలో సర్వే ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన ఆయన పదోన్నతిపై గుంటూరు జిల్లా సర్వే శాఖ సహాయ సంచాలకుడిగా నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపడుతున్న సర్వే, రీ-సర్వే కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి విజయవంతంగా పూర్తి చేయడానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా శాఖ పనితీరును మరింత మెరుగుపరచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, సర్వే శాఖ ఉపసంచాలకులు తోయజాక్షజ రావు పాల్గొన్నారు.

# ఆంధ్రేయ నియామకంపై హర్షం

### పండ్ల వ్యాపారుల ఘన సన్మానం.. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



**బాపట్ల, రక్షణ న్యూస్:**

బాపట్ల పట్టణ అధ్యక్షుడిగా మందపాటి ఆంధ్రేయ నియామకాన్ని స్వాగతిస్తూ పట్టణంలోని పండ్ల వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ నియామకానికి కృషి చేసిన బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ రాజుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నూతన పట్టణ అధ్యక్షుడు మందపాటి ఆంధ్రేయను కలిసి పండ్ల వ్యాపారులు అభినందనలు తెలియజేశారు. పూలమాలలు వేసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతంతో పాటు వ్యాపారుల సమస్యల పరిష్కారానికి ఆంధ్రేయ కృషి చేస్తారనే నమ్మకం ఉందన్నారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా ముందుకు తీసుకెళ్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తాడి సుబ్బారావు, యోహాన్, మోడీ భూషణం, అశోక్, సురేష్ తదితరులు పాల్గొని నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు.

# వావిలాల ఆశయాలను కొనసాగించిన లీలా మహేశ్వరి ధన్యజీవి

### 88వ జయంతి సందర్భంగా ఘన నివాళులు.. సేవా స్ఫూర్తిని కొనియాడిన అంబటి రాంబాబు

**గుంటూరు, రక్షణ న్యూస్:**

అంతరించిపోతున్న విలువలకు ప్రతిరూపమైన వావిలాల గోపాలకృష్ణయ్య ఆశయాలు, లక్ష్యాలను జీవితాంతం కొనసాగించిన స్వర్గీయ వావిలాల కుమారి లీలా మహేశ్వరి ధన్యజీవి అని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత అంబటి రాంబాబు కొనియాడారు. స్వర్గీయ వావిలాల కుమారి లీలా మహేశ్వరి 88వ జయంతి సందర్భంగా గురువారం గుంటూరులోని వావిలాల సంస్థ ఆడిటోరియంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి వావిలాల గోపాలకృష్ణయ్య మనవడు, వావిలాల సంస్థ కార్యదర్శి మన్నవ సోడేకర్ అధ్యక్షత వహించారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ వావిలాల గోపాలకృష్ణయ్యకు వెన్నంటి ఉంటూ ఆయన తుది శ్వాస విడిచే వరకు సేవలందించిన మహనీయురాలు లీలా మహేశ్వరి అని పేర్కొన్నారు. 1952 నుంచి 1972 వరకు నాలుగు సార్లు సత్తెనపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యేగా పనిచేసిన వావిలాల గోపాలకృష్ణయ్య ప్రజా జీవితంలో విశిష్ట సేవలు అందించారని గుర్తు చేశారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ వావిలాల కుటుంబంతో 1988 నుంచి సంపూర్ణ అక్షరాస్యత ఉద్యమం, సారా వ్యతిరేక ఉద్యమంలో కలిసి పనిచేసే అవకాశం లభించిందన్నారు. 1991 నుంచి 2001 మధ్య కాలంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అక్షరాస్యత గణనీయంగా పెరగడంలో ఈ ఉద్యమాల పాత్ర



కీలకమని చెప్పారు. అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ లీలా మహేశ్వరి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా వేలాది మంది విద్యార్థులకు మార్గదర్శకురాలిగా నిలిచారని తెలిపారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థలో నాలుగు దశాబ్దాల పాటు సేవలందించి క్రమశిక్షణ, దేశభక్తి విలువలను విద్యార్థుల్లో పెంపొందించారని పేర్కొన్నారు. వావిలాల సంస్థ మాజీ చైర్మన్ డాక్టర్ ఎం.డి.వి. రమణరావు మాట్లాడుతూ దేశభక్తి, మద్యనిషేధం, తెలుగు భాషాభిమానం, సామాజిక సేవా కార్యక్రమాలకు వావిలాల కుటుంబం చిరునామాగా నిలిచిందన్నారు. మహిళల విద్యాభివృద్ధికి దశాబ్దాల క్రితమే కృషి చేసిన కుటుంబంగా వావిలాల కుటుంబం ప్రత్యేక గుర్తింపు పొందిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ మాజేటి సోమశేఖర్, డాక్టర్ వి. సుబ్బారాయుడు, వావిలాల కుటుంబ సభ్యులు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొని లీలా మహేశ్వరి సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# ఎగ్ కార్ట్ యూనిట్లతో మహిళలకు స్వయం ఉపాధి

### మెప్మా ఆధ్వర్యంలో వ్యాపారాభివృద్ధి శిక్షణ కార్యక్రమం

**గుంటూరు, రక్షణ న్యూస్:**

పట్టణ పేద మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థిక స్వావలంబన సాధించేందుకు మెప్మా ఆధ్వర్యంలో ఎగ్ కార్ట్ యూనిట్ల లబ్ధిదారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (ఎన్ఈసీసీ) సహకారంతో స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉచితంగా ఎగ్ కార్టులు అందజేస్తున్నారు. ఒక్కో ఎగ్ కార్ట్ విలువ సుమారు రూ.50 వేలుగా ఉండగా, మహిళలకు స్థిరమైన ఆదాయ వనరులు కల్పించడమే ప్రధాన లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎంపికైన మహిళా లబ్ధిదారులకు గుంటూరు జిల్లా పరిశ్రమల కేంద్రంలో జోన్‌వారీగా వ్యవస్థాపక నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణలో భాగంగా ఎగ్ కార్ట్ వ్యాపార నిర్వహణ, ఆర్థిక ప్రణాళిక, మార్కెటింగ్ వ్యూహాలు, గుడ్ల పరిశుభ్రత, ఆహార భద్రతా ప్రమాణాలు, నిల్వ విధానాలు, నాణ్యత పరిరక్షణ అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే వివిధ రకాల గుడ్డు, చికెన్ వంటకాల తయారీ, మెనూ ప్రణాళిక, వినియోగదారుల




అభిరుచులకు అనుగుణంగా ఉత్పత్తుల రూపకల్పనపై ప్రాక్టికల్ శిక్షణ అందించారు. ధరల నిర్ణయం, ఖర్చు-లాభాల విశ్లేషణ, వినియోగదారుల నిర్వహణ, డిజిటల్ చెల్లింపుల వినియోగం, ఆర్థిక నిర్వహణ తదితర అంశాలపై కూడా శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ ద్వారా మహిళలు తమ వ్యాపారాలను మరింత విస్తరించుకుని సుస్థిర జీవనోపాధి సాధించగలరని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా గుంటూరు ప్రాజెక్టు డైరెక్టర్ వి. విజయలక్ష్మి, హెడ్ ఆఫీస్ సిబ్బంది, గుంటూరు మెప్మా అధికారులు, ఎన్ఈసీసీ కోఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యాలయాల్లో పచ్చదనానికి ప్రాధాన్యం

### అల్ట్రా హైడెన్సిటీ ప్లాంటేషన్‌కు స్థలాల పరిశీలన

**ముండ్లమూరు, రక్షణ న్యూస్:**

ముండ్లమూరు మండల పరిధిలోని కస్తూరిబా బాలికల విద్యాలయం, ఏపీ మోడల్ స్కూల్ ప్రాంగణాల్లో ఏర్పాటు చేయనున్న అల్ట్రా హైడెన్సిటీ ప్లాంటేషన్‌కు సంబంధించిన స్థలాలను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీడీ రవికుమార్, ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్లు, ప్లాంటేషన్ సూపర్వైజర్ రజిని తదితరులు స్థలాల అనుకూలతను పరిశీలించి సమీక్ష నిర్వహించారు. మొక్కల ఏర్పాటు, సంరక్షణ, నిర్వహణ విధానాలపై చర్చించారు. ప్లాంటేషన్ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసి విద్యాలయాల



పరిసరాల్లో పచ్చదనాన్ని పెంపొందించాలని అధికారులు సూచించారు. మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు.